గృహజ్యోతి దరఖాస్తుదారుల పరిశీలన



గాంధీనగర్ వార్డు కార్యాలయంలో గృహజ్యోతి దరఖాస్తుదారుల వివరాలను సేకరిస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

రంగారెడ్డినగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకానికి సంబంధించి దరఖాస్తుదారుల పరిశీలన కొనసాగుతోంది. రంగారెడ్డినగర్ పరిధిలో గాంధీనగర్ కమ్యూనిటీ హాలు, ఆదర్శ నగర్‌లోని విద్యుత్ బిల్లుల కలెక్షన్ పాయింట్, గురుమూర్తినగర్ తదితర ప్రాంతాల్లో గృహజ్యోతి పథకానికి సంబంధించి దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తుదారుల పరిశీలన ఆయా కేంద్రాల్లో కొనసాగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారని ఏఈ శంకర్ నాయక్ తెలిపారు. గాంధీనగర్ వార్డు కార్యాలయంలో లైన్‌మెన్ శ్రీనివాస్, సిబ్బంది శ్రీలత, పూజ, కళమ్మలు దరఖాస్తుదారుల వివరాలను నమోదు చేస్తున్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



కుత్బుల్లాపూర్: చింతల్ వెంకటేశ్వరనగర్‌లోని బీపీఎస్ ఒలింపియాడ్ పాఠశాలలో సోమవారం 20వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీవీఆర్ విద్యా సంస్థల ఛైర్మన్ కోటిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ప్రీ ప్రైమరీ విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. విద్యార్థులు కేక్ కట్ చేసి తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నాం

దుండిగల్ మున్సిపల్ వైస్‌చైర్మన్ పద్మారావు

దుండిగల్: మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని దుండిగల్ మున్సిపల్ వైస్‌చైర్మన్ పద్మారావు అన్నారు. బౌరంపేటలోని ఇందిరమ్మ కాలనీలో రూ.10లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించే దిశగా పని చేస్తున్నామని ఆయన తెలిపారు. అనంతరం ఈనెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు కాలనీలో జరగబోయే దాసాంజనేయస్వామి సహిత మల్లికార్జున స్వామి వారి 2వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, బెంబడి వనిత, సీనియర్ నాయకులు మురళీయాదవ్, వార్డు ప్రెసిడెంట్ సోమరాజు, యోగి, వంశీ, భూషణ్, శివ, సూర్య, అశోక్, జయ్‌కుమార్, తాతారావు, ఉత్తమ, సుబ్బమ్మ, గోపాల్, శ్రీను పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సుభాష్‌నగర్: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని దుండిగల్ మున్సిపల్ వైస్‌చైర్మన్ తుడుం పద్మారావు అన్నారు. సోమవారం దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లిలోని 13వ వార్డులో రూ.25 లక్షలతో భూగర్భ డ్రైనేజీ, 15వ వార్డులో రూ.20 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పనులను త్వరిగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఏల్లుగారి సత్యనారాయణ, భరత్‌కుమార్, నాయకులు సభ్యుడు శ్రీనివాస్, మురళీయాదవ్, శ్రీకాంత్, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బట్ట సంచులు వాడేలా చర్యలు తీసుకోండి



ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని వినతి పత్రం అందజేస్తున్న కోలా రవీందర్

సుభాష్‌నగర్: నాసిరకం ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిషేధించి జూట్, బట్ట సంచులను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సోమవారం జరిగిన ప్రజావాణిలో పర్యావరణ పరిరక్షకుడు కోలా రవీందర్‌ముదిరాజ్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూరగాయల మార్కెట్లు, హోటళ్లు, మాంసం దుకాణాల్లో నాసిరకంగా ప్లాస్టిక్ కవర్లనే వినియోగిస్తున్నారని అన్నారు. పర్యావరణానికి తీవ్ర హాని కలిగించే ఈ కవర్ల స్థానంలో నాణ్యమైన చేతి సంచుల వాడకాన్ని పెంపొందించాలని కోరారు.

కుమారుడిని చూసేందుకు వచ్చి మృతి

బైక్‌ను ఢీకొట్టిన బస్సు, వ్యక్తి దుర్మరణం



కుత్బుల్లాపూర్: ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల వివరాల ప్రకారం.. జనగామాకు చెందిన టైలరింగ్ పనులు నిర్వహించే ఉప్పలస్వామి(46) కుమారుడు అరవింద్ మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నాడు. కుమారుడిని చూసేందుకు సోమవారం కళాశాలకు వచ్చిన ఉప్పలస్వామి సాయి అనే వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై తిరుగు పయనమయ్యాడు. కొంపల్లి– సుచిత్ర మార్గమధ్యలోని జుడో షాపింగ్ మాల్ సమీపంలో కామారెడ్డి నుంచి జేబీఎస్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఉప్పలస్వామి కిందపడిపోగా బస్సు చక్రాలు అతడిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సాయి గాయాలతో బయటపడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

పోయాం.. మోసం!

'డబ్బులైన ఇప్పించండి.. ఫ్లాట్ అయిన ఇవ్వండి'

● వినూత్నంగా నిరసన తెలిపిన బాధితులు ● తమకు న్యాయం చేయాలని డిమాండ్



స్థల యజమాని ప్రవీణ్‌రెడ్డితో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద ఫ్లెక్సీతో నిరసన తెలుపుతున్న బాధితులు

కుత్బుల్లాపూర్: బిల్డర్ అవతారం ఎత్తిన ఓ వ్యక్తి ప్లాట్ల పేరిట పలువురిని మోసం చేసి నిర్మిస్తున్న బిల్డింగ్‌ను మధ్యలో ఆపి వెళ్లిపోవడంతో కొనుగోలు చేసిన వ్యక్తులు వినూత్న తరహాలో నిరసన తెలుపుతున్నారు. సదరు బిల్డింగ్ వద్ద బ్యానర్ పట్టుకొని 'డబ్బులైన ఇప్పించండి.. ఫ్లాట్ అయిన ఇవ్వండి'అంటూ సోమవారం నిరసనకు దిగారు. బాధితులు, స్థల యజమాని ప్రవీణ్‌రెడ్డి వివరాల ప్రకారం.. అల్విన్‌కాలనీలో నివాసముండే సల్లాల రమేష్ అనే వ్యక్తికి 2022 జూన్ నెలలో గాజులరామారం మల్లారెడ్డి నగర్‌లో 200 గజాల స్థలాన్ని జీ– ప్లస్2 పర్మిషన్ తీసుకొని ప్రవీణ్‌రెడ్డి అగ్రిమెంటు చేశాడు.

◆ అనంతరం రమేష్ బిల్డింగ్ నిర్మాణం జీ–ప్లస్ 2కు అదనంగా అక్రమ మార్గంలో మరో రెండు అంతస్తులు నిర్మించాడు. ఒక్కో ఫ్లోర్‌కు ఒక్కో ఫ్లాట్‌ను పవన్ కుమార్ (రూ.25 లక్షలు) అంజిరెడ్డి (రూ.29 లక్షలు) విప్పిన్, రితేష్ ఇద్దరి వద్ద (రూ.56 లక్షలు) తీసుకోవడమే కాకుండా అగ్రిమెంట్ చేసిన స్థల యజమాని ప్రవీణ్‌రెడ్డి సైతం రూ.25లక్షలు ఇచ్చారు. మొత్తం రూ.1.35 కోట్లు తీసుకున్న రమేష్ నిర్మాణ పనులు మధ్యలోనే ఆపేసి వెళ్లిపోయాడు. దీంతో ఇదే విషయంపై బాధితులు అంతా కలిసి జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

◆ ఇది సివిల్ వివాదం కాబట్టి తాము జోక్యం చేసుకోలేమని పోలీసులు చెప్పారని తెలిపారు. అయితే తమ వద్ద తీసుకున్న డబ్బులకు పూర్తి ఆధారాలు ఉన్నప్పటికీ పోలీసులు మాత్రం కేసు నమోదు చేయకుండా ఆరు నెలల నుంచి స్టేషన్ చుట్టూ తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రమేష్ అనే వ్యక్తి ఇదే తరహాలో పలు ప్రాంతాల్లో మోసం చేశారని తెలిపారు. పోలీసులకు వివరించినా పట్టించుకోలేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

◆ తమ లాగా ఇతరులు మోసపోకుండా రమేష్ అనే వ్యక్తిని అరెస్టు చేసి విచారణ చేపడితే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని అన్నారు. బిల్డింగ్ పనులు పూర్తి చేయకుండా కాలయాపన చేయడంతో స్థల యజమాని 2023 నవంబర్‌లో స్టే ఆర్డర్ తీసుకొచ్చాడు. దీంతో డబ్బులు ఇచ్చి మోసపోయిన బాధితులు మల్లారెడ్డి నగర్‌లో నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ వద్ద నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. తమకు న్యాయం చేసి మోసాలకు పాల్పడుతున్న రమేష్‌ను పోలీసులు అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.

బాధితులు వస్తే కేసులు పెడతాం..



గాజులరామారం పరిధిలోని మల్లారెడ్డి నగర్‌లో రమేష్ అనే వ్యక్తి బిల్డింగ్ నిర్మాణం చేపట్టి తమను మోసం చేశాడని గతంలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేశాం. మిగిలిన బాధితులు వస్తే వారి ఫిర్యాదుల ఆధారంగా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఈ కేసు విచారణలో ఉంది. మోసాలకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

– క్రాంతి, జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు



ఐడీపీఎల్ రోడ్డులో ఎర్రగోడల సమీపంలో ఓ చెట్టును మోడు వరకు నరికేసిన దృశ్యం

రంగారెడ్డినగర్: నీడనిచ్చే పచ్చని చెట్లపై గొడ్డలి వేటు కొనసాగుతూనే ఉంది. ×పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు×అనే నినాదం కేవలం ప్రచారాలకే పరిమితమవుతన్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఐడీపీఎల్ – జగద్గిరిగుట్ట రోడ్డు మార్గంలోని ఎర్రగోడల సమీపంలో ఉన్న భారీ వృక్షాన్ని ఇటీవల ఓ స్థల యజమాని అడ్డుగా ఉందనే సాకుతో మోడు వరకు నరికి వేయించాడు. ఓ పక్క ఎండలు ముదురుతున్న తరుణంలో చల్లని గాలితో పాటు నీడనిచ్చే వృక్షాన్ని ఇలా ఇష్టానుసారంగా నరికివేయడంపై పలువురు పర్యావరణ ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చెట్లను నరికివేస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కూన శ్రీశైలంగౌడ్‌కు ఆహ్వానం



సుభాష్‌నగర్: గాజులరామారం శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ కమిటీ సభ్యులు సోమవారం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్‌ను షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 18న జరిగే రేణుకాఎల్లమ్మ జాతర మహోత్సవానికి రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. అదే విధంగా రిట్జ్ టవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శ్రీరామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వానాన్ని అందజేశారు.

గ్రామంలో గాలి పోచమ్మ గుడిని నిర్మించండి



అమ్మవారి భవిష్యవాణి వినిపిస్తున్న రాజేష్

భవిష్యవాణిలో అమ్మవారు

సుభాష్‌నగర్: ఈ ఏడాది వర్షాలు అంతంత మాత్రమే పడతాయి.. ప్రజలు అప్రమత్తంగా ఉండండి.. గ్రామంలో గాలి పోచమ్మ గుడిని నిర్మించండి.. గుడి స్థలంపై కేసు వేసిన విషయం నేను చూసుకుంటా.. అంత మంచి జరుగుతుందంటూ సూరారం కట్ట మైసమ్మ జాతరలో భాగంగా నిర్వహించిన రంగంలో భవిష్యవాణిని రాజేష్ వినిపించారు. జాతరలో భాగంగా సోమవారం కూడా భక్తుల తాకిడి ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగింది. సాయంత్రం సూరారం గ్రామం నుంచి పోతరాజుల విన్యాసాల మధ్య ఫలహారంబండి ఊరేగింపు వైభవంగా జరిగింది. బుధవారం రోజున అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది.

ఫలహారబండి.. పోతరాజుల సందడి

సుభాష్‌గనర్: సూరారం శ్రీకట్టమైసమ్మ జాతరలో భాగంగా సోమవారం రాత్రి అమ్మవారి ఫలహారబండి ఊరేగింపు వైభవంగా కొనసాగింది. సూరారం గ్రామం ప్రధాన రహదారి మీదుగా కొనసాగిన ఈ జాతరలో పోతరాజుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయం వరకు కొనసాగిన ఫలహారబండి ఊరేగింపులో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పోతరాజులు నృత్యాలు

చిరంజీవికి శుభాకాంక్షలు

కుత్బుల్లాపూర్: పద్మవిభూషణ్ అవార్డుకు ఎన్నికైన మెగాస్టార్ చిరంజీవిని సోమవారం మెగా పవర్ యువత వ్యవస్థాపక అధ్యక్షుడు రవణం స్వామినాయుడుతో కలిసి మెగా పవర్ యూత్ ఉపాధ్యక్షుడు కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన టీఆర్ఎస్ నాయకుడు గుబ్బల లక్ష్మీనారాయణ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



మెగాస్టార్ చిరంజీవికి శుభాకాంక్షలు తెలుపుతున్న గుబ్బల లక్ష్మీనారాయణ

మగ్గంపై నేసి.. స్వామివారికి సమర్పించి

వైభవంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న కార్పొరేటర్ జగన్, పద్మశాలి సంఘం నేతలు


జగద్గిరిగుట్ట: లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి మగ్గంపై చేనేత వస్త్రాలు తయారు చేశారు. జగద్గిరిగుట్ట కొండపై ఉన్న శివ పంచాయతన మార్కండేయ దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బస్టాప్ నుంచి కార్పొరేటర్ జగన్ ఆధ్వర్యంలో పద్మశాలి సంఘం నేతలు ఊరేగింపుగా తరలివెళ్లి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పద్మశాలి కులస్తులు స్వయంగా మగ్గంపై నేసిన పట్టు వస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. పద్మశాలి కులస్తులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు భోగ రాజేష్ నేత, సభ్యులు మునిపల్లి జనార్దన్, పల్లె దత్తాత్రేయ, నారా నరేందర్, మాయకోటి ప్రభాకర్, మహిళలు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 16 ఫిర్యాదులు

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో పలువురు ఫిర్యాదులు అందజేశారు. కుత్బుల్లాపూర్ సర్కిల్‌కు సంబంధించి తొమ్మిది, గాజులరామారం సర్కిల్‌లో ఏడు ఫిర్యాదులు రాగా ఉప కమిషనర్లు నర్సింహులు, మల్లయ్యలు సదరు దరఖాస్తులను స్వీకరించి తగు చర్యలు చేపట్టాల్సిందిగా ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

దరఖాస్తుదారుల పేర్లు నమోదు చేస్తున్నాం

సుభాష్‌నగర్: ఇటీవల ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకానికి (200 యూనిట్స్ ఉచిత విద్యుత్) దరఖాస్తుదారులు పోటెత్తారు. గాజులరామారం సబ్‌స్టేషన్ పరిధిలో ఏఈ చైతన్య భార్గవ్ ఆధ్వర్యంలో పలుచోట్ల కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాజులరామారం సబ్‌స్టేషన్ పరిధిలోని కమ్యూనిటీహాళ్ల వద్ద ప్రతిరోజు కొన్ని ప్రాంతాలను ఎంచుకొని దరఖాస్తుదారుల పేర్లు నమోదు చేస్తున్నామని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తమ వెంట గృహజ్యోతి రిసిప్ట్, లేటెస్ట్ కరెంట్ బిల్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలను పొందుపరచాలని తెలిపారు.



పెంచిన ఆస్తిపన్ను తక్షణమే తగ్గించాలి

నిజాంపేట్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను కాపాడాలని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ నాయకులు సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల అండదండలతో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి జీవో 59 కింద క్రమబద్ధీకరించుకున్నారని అన్నారు. సదరు స్థలాల ఆక్రమణలపై విచారణ చేపట్టాలన్నారు. అదే విధంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2022–23వ సంవత్సరంలో పాత భవనాలకి రెండింతలు పెంచిన ఆస్తిపన్ను తక్షణమే తగ్గించాలన్నారు. లేకుంటే ఈనెలలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ సెక్రటరీ అరుణ్‌రావు, స్పోక్‌పర్సన్ కౌశిక్ నాయుడు, ప్రసాద్‌రాజు తదితరులు ఉన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

నిజాంపేట్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్ అన్నారు. సోమవారం నిజాంపేట్ వార్డు కార్యాలయం వద్ద మున్సిపల్ అధ్యక్షుడు రాములు ఆధ్వర్యంలో కార్మికులలో సమ్మె విషయమై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. గతంలో ఉన్న 44 చట్టాలను నాలుగు చట్టాలుగా బీజేపీ ప్రభుత్వం మార్చిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడంతో పాటు కార్మికుల హక్కులను తుంగలో తొక్కుతూ తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు.

◆ వంద రోజుల కనీస పని దినాలను 200 రోజులకు పెంచాలని తెలిపారు. కార్మికుల వేతనం పెంచి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. రైతు నల్ల చట్టాలను వెనక్కి తీసుకోవాలని తదితర డిమాండ్లలో చేపడుతున్న సమ్మెలో కార్మికులు, కర్షకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు హరినాథ్ రావు, బాలకృష్ణ, నాగయ్య, జితయ్య, కృష్ణ, వెంకటేష్, బాగ్యమ్మ, నర్సమ్మ , యాదమ్మ, కౌసల్య, అమురుతమ్మ, ఎల్లమ్మ, సత్యమ్మ, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నాలా స్థలాల ఆక్రమణలు

పట్టించుకోని కుత్బుల్లాపూర్ టీపీఓ అధికారులు

- ఇలా చేస్తూ పోతే వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులే..
- ఆక్రమణలు అడ్డుకోవడంలో అధికారులు విఫలం

జీడిమెట్ల: ప్రభుత్వ, నాలా స్థలాల ఆక్రమణదారులకు కుత్బుల్లాపూర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు అజ్యం పోస్తున్నారు. ప్రభుత్వ స్థలాలను అక్రమించుకుంటున్నారా? మాది మాకు ముడితే చాలు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. టౌన్ ప్లానింగ్‌లో పనిచేసే ఓ వ్యక్తి అన్నీతానై వ్యవహరిస్తూ ఆక్రమణదారులకు, అధికారులకు మధ్య సెటిల్‌మెంట్‌లు చేస్తున్నాడు. ముడుపులు చెల్లించినవారే ఎంత అప్పజెప్పారో బహిరంగంగానే లెక్కలు చెబుతున్నారు. తప్పు చేసినా సరే ఎలా తప్పించుకోవాలో అతగాడే ఆక్రమణదారులకు నేర్పిస్తున్నాడని సర్కిల్ ప్రజలు అతనిపై మండిపడుతున్నారు. అక్రమ కట్టడాలను అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు వారిచ్చే అమ్యామ్యాలకు జైకొడుతున్నారు. ''నువ్వు తిట్టినట్లు చెయ్.. నేను ఏడ్చినట్లు చేస్తా''అన్నట్లుగా ఉంది టౌన్‌ప్లానింగ్ అధికారుల, సిబ్బంది తీరు.

టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు..

◆ సుభాష్‌నగర్‌లోని గంపలబస్తీలో ఓ వ్యక్తి ఏకంగా తన స్థలానికి పక్కనే ఉన్న నాలా స్థలాన్ని అక్రమించి నిర్మాణం చేపట్టాడు. ఈ విషయమై సుభాష్‌నగర్ ప్రజలు నేరుగా కుత్బుల్లాపూర్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ అధికారుల్లో ఎలాంటి చలనం లేకపోవడం పట్ల అధికారులపై ప్రజలు కన్నెర్ర చేస్తున్నారు. ఇక ఎవరైనా నేరుగా కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే టౌన్‌ప్లానింగ్ పైఅధికారులు కింది స్థాయి సిబ్బందిని పిలిచి చివాట్లు పెట్టినట్లు చేస్తారు. దీనికి సిబ్బంది సరే పని ఆపివేస్తామని ఇప్పుడే వెళ్తున్నామని నటిస్తారు. మరుసటి రోజు పనులు మాత్రం యథావిధిగా కొనసాగుతాయి.

నాలా అక్రమిస్తే సుభాష్‌నగర్‌లో వరదలు తప్పవు..

◆ వర్షాకాలంలో వానలు బారీగా కురిసినపడు పైనుండి నాలాలో నీటి ఉధృత ఎక్కువగా ఉంటుంది. దీంతో నాలా స్థలాన్ని అక్రమించి కట్టడాలు చేపట్టడంతో నీరు మొత్తం కాలనీలోని ఇళ్లలోకి వెళ్తుంది. దీంతో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం లేకపోలేదు. కొంత మంది స్వార్థానికి ప్రజలకు చాలా నష్టం జరిగే అవకాశం ఉన్నప్పటికి అన్నీ తెలిసిన అధికారులు మాత్రం మిన్నకుండిపోతున్నారు. ఇప్పటికైనా సదరు నిర్మాణంపై టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూద్దాం.



నాలా స్థలాన్ని అక్రమించి నిర్మిస్తున్న ఓ బిల్డింగ్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029